వాడపల్లి ఆలయానికి డీసీ హోదా - 7లో



కుమారుడికి బెయిల్ మంజూరు సమాచారాన్ని టీవీలో వీక్షిస్తున్న తాతారావు

కోడికత్తి శ్రీనుకు బెయిల్‌పై హర్షాతిరేకాలు



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధినేత జగన్‌పై విశాఖ పట్నం ఎయిర్‌పోర్టులో కోడి కత్తితో హత్యాయత్నం ఘటనలో నిందితుడిగా ఉన్న ముమ్మిడివరం మండలం ఠాణేలంక శివారు పెదపేటకు చెందిన జనిపల్లి శ్రీనివాసరావు అలియాస్ కోడికత్తి శ్రీనుకు బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 5 సంవత్సరాల 3 నెలల 15 రోజులు రిమాండు ఖైదీగా ఉన్న శ్రీనుకు ఎట్టకేలకు హైకోర్టు కొన్ని షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ప్రజా సంఘాలు, దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. పెదపేటలో వున్న శ్రీను తండ్రి తాతారావు ఈ సమాచారాన్ని టీవీలో చూసి ఆనందపడ్డాడు. ఢిల్లీలో వున్న తల్లి సావిత్రి, సోదరుడు సుబ్బరాజు ఆనందానికి అవధుల్లేవు. శ్రీనుకు బెయిల్ విషయంలో హైకోర్టు న్యాయవాది సలీమ్ మిత్ర బృందం ఆద్యంతం చేసిన కృషిని ప్రతి ఒక్కరూ అభినందించారు.

ప్రధాన వార్త మెయిన్‌లో...



సమనసలో మందకొడిగా సాగుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణ పనులు



వైద్యం... 'మిథ్య'



- ఇదీ అమలాపురంలో ప్రభుత్వ వైద్య కళాశాల పరిస్థితి
- బిల్లులు చెల్లించకపోవడంతో మందకొడిగా పనులు
- పట్టించుకోని వైసీపీ జిల్లా ప్రజాప్రతినిధులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి సమీపంలో ఉన్న సమనస గ్రామంలో వైసీపీ ప్రభుత్వహయాంలో చేపట్టిన వైద్య కళాశాల నిర్మాణం 'మిథ్య'గా మారింది. పనుల్లో ఆశించిన మేర పురోగతి లేదు. పునాదుల స్థాయిలోనే కొన్ని భవనాలు, మరికొన్ని ఒకటి, రెండు అంతస్తుల శ్లాబ్‌ల స్థాయిలో పనులు జరుగుతున్నాయి. ఆర్థికపరమైన చెల్లింపుల్లో జాప్యం కారణంగా భవనాల నిర్మాణ పనులకు బ్రేక్ పడుతోందని సమాచారం. సమనస పరిసర గ్రామాల్లో సేకరించిన సుమారు 56 ఎకరాల భూమిలో రూ.475 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణం మందకొడిగానే సాగుతోంది. ఇక్కడ 32 భవనాలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 17 భవనాలు మాత్రమే నిర్మించడానికి కాంట్రాక్టు సంస్థ అయిన మేఘా ఇంజనీరింగ్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రధానమైన 750 పడకల ఆసుపత్రి కీలక భవనంతోపాటు ఆరు బ్లాకులతో వైద్య కళాశాల భవనాలు మొదటి శ్లాబ్ దశకు చేరుకున్నాయి. మిగిలిన బాయ్స్, లేడీస్ హాస్టల్స్ భవనాలు, వివిధ రకాల ల్యాబ్‌లు నిర్మాణ పనులు పునాదుల దశలోనే కొనసాగుతున్నాయి. వాస్తవానికి ఈ వైద్య కళాశాల నిర్మాణ పనులను 2025 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాల్సిందిగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఇక్కడ ఆచరణ సాధ్యం కానిపరిస్థితుల్లో ఉన్నాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లు చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఈ భవనాల నిర్మాణానికి గ్రహణం పట్టేలా ఉందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక వైసీపీకి చెందిన మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఇతర ప్రజాప్రతినిధులెవరూ అటువైపు పెద్దగా కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

రీసర్వే డేటాను డిజిటల్ రికార్డుల్లో భద్రపరచాలి

జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 8: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్షా పథక సమగ్ర రీ సర్వే ద్వారా సేకరించిన డేటాను డిజిటల్ రికార్డుల్లో భద్రపరచాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు అనంతరం జేసీ జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడారు. క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ టైటిల్ కార్డుల పత్రాలను భూ యజమానికి జారీ చేయాలన్నారు. హక్కు పత్రాల్లో ఆస్తి యజమాని పేరు ప్రత్యేక గుర్తింపు, ఫొటో, క్యూఆర్ కోడ్‌తో భవిష్యత్తులో జరిగే అన్ని లావాదేవీలు సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేసి లబ్ధిదారుల సొంత ఇంటి కలను సాకారం చేయాలని ఆదేశించారు. సర్వే-ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు కె.ప్రభాకర్, జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి శ్రీనివాసరావు, డీపీవో వి.కృష్ణకుమారి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, నోడల్ అధికారి కె.భీమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం, కార్మిక సంఘాల నాయకులు

రూ.2 లక్షల వరకు రైతుల పంట రుణాలు

మాఫీ చేయాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 8: రూ.2లక్షల వరకు అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండు చేస్తూ ఏపీ రైతు సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేలు సాగు సాయం అందించాలని, ఇన్‌పుట్ సబ్సిడీ బీమా నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతా చట్టం అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.25వేలు చెల్లించాలని, కార్మిక వర్గంపై అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కు తీసుకోవాలని, ఆహార సరుకులపై జీఎస్టీ ఎత్తివేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చెల్లుబోయిన కేశవశెట్టి, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన తాతారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంపట్ల వరుణ్‌బాబు, జంపన ప్రసాదరావు, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు, జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎక్కడికక్కడ ఆశా వర్కర్ల నిర్బంధం - 8లో



కలెక్టరేట్‌లో డీడీవోల సమావేశంలో మాట్లాడుతున్న డీఐవో సుబ్బారావు

ఉద్యోగుల వ్యక్తిగత వివరాలు పీపీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి

అమలాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జీతాలను 010 పద్దు నుంచి డ్రా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులంతా తమ వ్యక్తిగత వివరాలను భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఉద్యోగుల సమగ్ర డేటా పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు డీడీవోలకు సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో గురువారం ఆయన జిల్లాలోని డీడీవోలతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణకు సంబంధించి విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో పోలింగ్ విధులైన ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్ సిబ్బంది కోసం గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల వివరాలను పీపీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌కు చెందిన డీఐవో సుబ్బారావు ఇందుకు సంబంధించి శాస్త్రీయ, సాంకేతికపరమైన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సార్వత్రిక ఎన్నికలను శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఉద్యోగీ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో పది కంప్యూటర్ల సహాయంతో ఈ ప్రక్రియను చేపట్టామన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి ఏడాది జూన్ 30లోపు రిటైర్ అయ్యే గెజిటెడ్ ఉద్యోగులు డేటా ఎంట్రీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, సుబ్రహ్మణ్యంలకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ జిల్లా శాఖ ప్రతినిధులు

ఉద్యోగులు, ఉపాధ్యాయ ప్రధాన సమస్యలను...

ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి

ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రాలు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 8: ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలను రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రాలు అందజేశారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలసంక్షేమంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి బీఎస్ రామారావు (దొరబాబు), సరిదే సత్యపల్లంరాజు పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో నెం.117ను రద్దు చేయాలని, 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఉపసంహరించాలని, పాఠశాల విద్యలో ఆంగ్ల మాధ్యమంతో సమాంతరంగా తెలుగు మాధ్యమం కొనసాగించాలని, ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు చేయాలని, ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్లు, జీతాలు చెల్లించాలని.... ఇలా 12 ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఎస్టీయూ జిల్లా శాఖ నాయకులు అందజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కన్వీనర్ కొప్పుల సత్తిబాబు, జనసేన నాయకులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర సంఘ నాయకులు నేరేడుమిల్లి సత్యనారాయణ, నాగిరెడ్డి శివప్రసాద్, నందెపు శ్రీనివాస్, ఆకుల బాలబసవేశ్వరరావు, బీఎన్‌వీఎస్ గుప్తా, బిక్కిన నాగేశ్వరరావు, బసవా వేణుగోపాల్, సీహెచ్‌వీ కృష్ణమూర్తి, బొడ్డు సుబ్బారావు, కేదాసి శ్రీనివాస్, కడలి రంజిత్‌కుమార్, రాజ్‌గోపాల్, ఏసురాజు, ఆచంట ప్రసాద్, బండారు శేష తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల ముందస్తు ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న సత్తిబాబు

ఇంటర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- జిల్లాలో 38 పరీక్షా కేంద్రాల ఏర్పాటు: డీఆర్వో సత్తిబాబు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 8: మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ బోర్డు పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు సూచించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహణ కమిటీ సభ్యులతో పరీక్షల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఇంటర్ ప్రశ్నపత్రాలు భద్రత, తరలింపు అంశంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా కళాశాలల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఎంపిక చేసిన 38 కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు జిల్లా అధికారి వి.సోమేశ్వరరావు, కమిటీ సభ్యులు ఎస్వీ మంగారావు, పి.గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

అంతర్వేది స్వామి కల్యాణోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

- అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

అంతర్వేది, ఫిబ్రవరి 8: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామికల్యాణోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి కోరారు. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు జరిగే వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలపై గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. కల్యాణ మండప ప్రదేశం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవాలపై సమీక్షించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే పనులు జరుగుతున్న మంచినీటి చెరువులోనే తెప్పోత్సవం జరుగుతుందన్నారు. చలువ పందిళ్ల ఏర్పాటు, విద్యుత్, క్యూలైన్లు, బందోబస్తు, పార్కింగ్, సీసీ కెమెరాలు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, పరిశుభ్రత, తాగునీరు సౌకర్యాలపై సూచనలిచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, రథసప్తమి నాటికి పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, ఆలయ అధికారులతో కలిసి ప్రధానమైన తీర్థ మహోత్సవ ప్రదేశాలను సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడాతొక్కిసలాట జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, తహసీల్దారు పెద్దిరాజు, డిప్యూటీ తహసీల్దారు భాస్కర్, ఆర్ఐ రామరాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమోహన్



అల్లవరం, ఫిబ్రవరి 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడిగా అల్లవరం ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొందరు ఎంపీడీవోలు ఇతర జిల్లాలకు బదిలీ కాగా ఇతర జిల్లాల నుంచి కొందరు కోనసీమ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వరరావు (ఆత్రేయపురం), జి.వెంకటేశ్వరరావు (అమలాపురం), త్రిశూలపాణి (పి.గన్నవరం), కార్యదర్శులుగా కె.వాణి (కొత్తపేట), కె.శ్రీదేవి (కాట్రేనికోన), కేవీ లక్ష్మి (రాయవరం), కేవీఎస్ రావు (ముమ్మిడివరం), కోశాధికారిగా ఎ.శ్రీనివాస్ (రావులపాలెం) ఎన్నికైనట్టు జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిని ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది అభినందించారు.

కోనసీమ రైల్వే లైన్‌కు రూ.300 కోట్లు కేటాయింపుపై కృతజ్ఞతలు

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలుసుకున్న టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి హరీష్‌మాధుర్

అమలాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లావాసుల చిరకాల డిమాండు అయిన కోనసీమ రైల్వేలైన్‌కు ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించడంపై తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన గురువారం కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే లైన్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, చేతకానితనంతో అవసరమైన స్థలాన్ని సేకరించలేకపోయిందని విమర్శించారు. అధికార పార్టీ ఎంపీలెవరూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావట్లేదన్నారు. త్వరలో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, రైల్వేలైన్‌ను పూర్తిచేసే బాధ్యత తీసుకుంటుందన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహననాయుడుతో కలిసి హరీష్‌మాధుర్ కలుసుకున్నారు.





పిఠాపురం-కాకినాడ జాతీయ రహదారిపై



గొల్లప్రోలు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద..



మంచు దుప్పటి

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 8: జాతీయ రహదారి పరిసరాలు, రహదారులు, పంట పొలాలు, భవనాలను గురువారం తెల్లవారుజామున మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం పది గంటల వరకూ అలుముకున్న మంచుతో రహదారులపై వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెల్లవారుజామున రోడ్లపై ఏమీ కనిపించకపోవడంతో గంటన్నర పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చలితీవ్రత కొంత మేర తగ్గుముఖం పట్టి, పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గురువారం భిన్నమైన వాతావరణం కనిపించింది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు 216వ జాతీయ రహదారి, పంట పొలాలను మంచు కప్పేసింది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించని పరిస్థితి నెలకొంది. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల్లో భవనాలపై పొగమంచు ఆవరించింది. ఇంత దట్టంగా పొగమంచు ఆవరించడం ఇదే తొలిసారి అని పలువురు తెలిపారు.

వాడపల్లి ఆలయానికి డీసీ హోదా

డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిశోర్‌కుమార్



ఆత్రేయపురం, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో వార్షిక ఆదాయం రూ.5 కోట్లు పైబడి వస్తున్న ఆలయాలకు ప్రభుత్వం ఎట్టకేలకు డిప్యూటీ కమిషనర్ హోదా కల్పించింది. ఏడాది క్రితమే ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించి పరిపాలనా ఆమోదం పొందగా కేబినెట్ తీర్మానం పొందింది. ఆ దిశగా రాష్ట్రంలో ప్రధాన ఆలయాలకు డీసీ, ఏసీ హోదాలు దక్కాయి. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక ఆదాయం రూ.12 కోట్లకు పైగా చేరుకుంది. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ప్రస్తుతం గ్రేడ్-1 ఈవోగా ముదునూరి సత్యనారాయణరాజు పని చేస్తున్నారు. ఆలయానికి డీసీ హోదా లభించడంతో సదరు గ్రేడ్ అధికారిని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ సహాయ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ పదోన్నతి పొంది ఉప కమిషనర్ హోదాలో వాడపల్లి ఆలయ ఈవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిశోర్‌ను ఆలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీ హోదా దక్కడంతో పరిపాలనా సౌలభ్యంతో పాటు భక్తుల సమస్యలను సకాలంలో పరిష్కరించగలగడం, అభివృద్ధి పనులపై త్వరితగతిన నిర్ణయం తీసుకునే అధికారం ఆయనకు ఉంది.



బాధ్యతలు స్వీకరిస్తున్న కిశోర్‌కుమార్

ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌లో భారీ చోరీ

- బ్యాంకు వెనుక నుంచి చొరబడిన దుండగులు
- రూ.25 లక్షల నగదు, రూ.50 లక్షల బంగారం అపహరణ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 8: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌లో భారీ చోరీ జరిగింది. బ్యాంక్ కార్యాలయం వెనుక ఉన్న ఇనుప కిటికీని గ్యాస్ కట్టర్‌తో తొలగించి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ చోరీ జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరకంచి మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో పెద్దిపాలెం రహదారి మార్గంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ శాఖలో దుండగులు చొరబడ్డారు. బ్యాంక్ కార్యాలయం వెనుక భాగాన ఉన్న కిటికీ ఇనుప గ్రిల్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి ఆ మార్గం గుండా దుండగులు బ్యాంకులోకి ప్రవేశించారు. బ్యాంకులోని అలారం, సీసీ కెమెరాలు పని చేయకుండా చేసి చాకచక్యంగా చోరీకి పాల్పడ్డారు. బ్యాంక్ స్ట్రాంగ్ రూంలోని రెండు లాకర్లు తెరిచి వాటిలో రూ.25 లక్షలు నగదు, మరో 50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను దుండగులు అపహరించారు. గురువారం ఉదయం బ్యాంకుకు వచ్చిన అధికారులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి ఎస్‌ఐలు పవన్‌కుమార్, సతీష్, జబీర్‌లతో పాటు జగ్గంపేట, అన్నవరం, రౌతులపూడి ఎస్‌ఐలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్పీ దుండగులు చొరబడ్డ బ్యాంక్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ చోరీకి ఆరుగురు వ్యక్తులు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్లూస్‌టీం, డ్యాగ్ స్క్వాడ్‌లు రప్పించి తనిఖీలు చేపట్టారు. ఈ చోరీ సంఘటనపై ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ కోటి రూపాయలు సొత్తు చోరీకి గురైందని రూ.25 లక్షలు నగదు, మరో రూ.50 లక్షలు బంగారం ఉందని తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఉత్తరకంచి ఎస్‌బీఐలో చోరీ జరిగిందనే విషయం తెలిసి ఆ బ్యాంక్ పరిధిలోని ఖాతాదారులు, ప్రజలు బ్యాంకు వద్దకు తరలివచ్చారు. మెయిన్ రోడ్డులో ఉన్న బ్యాంక్‌లో చోరీ జరగడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్ బ్యాంకు పరిసరాల్లో కలియతిరిగాయి. క్లూస్‌టీం బృందం లాకర్లు, స్ట్రాంగ్ రూంల వద్ద వేలి ముద్రలు సేకరించింది.





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

ఇళ్ల పట్టాల పంపిణీపై సమగ్ర విచారణ జరిపించాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన

బిక్కవోలు, ఫిబ్రవరి 8: అనపర్తి నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీలో పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. బిక్కవోలు, బలభద్రపురం గ్రామాల్లో జరిగిన అవకతవకలపై ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. బిక్కవోలులో 180 మంది, బలభద్రపురంలో 140 మందిని ఏ కారణం లేకుండా అనర్హులుగా చేర్చారన్నారు. బిక్కవోలులో 1100 మందికి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. 180 మంది పేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో లేని అనర్హులకు పట్టాలు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. బిక్కవోలు ఇళ్ల పట్టాల పంపిణీలో రూ.12 కోట్లు చేతులు మారాయన్నారు. బదిలీపై వెళ్లిపోయిన తహశీల్దార్ పోసిబాబు రాత్రికి రాత్రి గుట్టు చప్పుడు కాకుండా పాత తేదీలతో 120 పట్టాలపై సంతకాలు చేశారని, అలాగే బలభద్రపురంలోనూ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చిందన్నారు. నియోజకవర్గమంతా ఇదే పరిస్థితి ఉందని, అందువల్ల విజిలెన్స్ విచారణ జరపాలని రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకుని పట్టాలు రాని మహిళలతో కలసి గురువారం ఆయన బిక్కవోలు టీడీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి పాదయాత్రగా చేరుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సింగారపు రామారావు, రమేష్, సిద్ధు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కె.పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 8: కేవీకే సహకారంతో భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయ సూత్రాలు, బయోకల్చర్స్ తయారీపై విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం దృష్టి సారించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కె.పద్మరాజు అన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్ర విభాగపు సువాస ది స్టూడెంట్ క్లబ్ తరఫున ప్రకృతి వ్యవసాయం, బయోకల్చర్ తయారీపై శిక్షణ, వర్క్‌షాపును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఐటీ రంగంపై ఆధారపడకుండా ప్రకృతి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఫుడ్ ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో దాదాపు 30 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టారని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు తెలిపారు. ముఖ్యంగా పంట పోషణకు, రక్షణకు సంబంధించి 22 రకాల బయోకల్చర్స్‌ను ఏవిధంగా తయారు చేసుకోవాలో ప్రదర్శనగా చూపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, నన్నయ వర్సిటీ వృక్ష శాస్త్ర విభాగం ఆచార్యులు వి.పద్మావతి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల కోర్స్ కోఆర్డినేటర్ కె.సామ్యూల్‌కుమార్ ఎల్.ముత్యాలనాయుడు, కేవీకే అధికారులు జీవీఆర్ సత్యవాణి, దిలీప్, విజయ్‌వర్ధన్, ప్రభాత్‌నాయుడు, ఎంఏ రాజు, రత్నాజీ ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలి

విద్యార్థులు, అధ్యాపకులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమాజ హితంగా జీవించాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బీసీడీఈ) అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. దీనికి వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బీసీడీఈ కళాశాలల కోఆర్డినేటర్‌లకు, స్టూడెంట్ అంబాసిడర్లకు అవగాహన కల్పించి విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీడీఈ కార్యదర్శి, సీఈవో ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్, కన్సల్టెంట్ కె.సి.మ్రాన్, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, బీసీడీఈ యూనివర్సిటీ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

టీవీ సీరియల్‌లో అవకాశం ఇప్పిస్తామని వ్యభిచార రొంపిలోకి..

దంపతులకు ఏడేళ్ల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): టీవీ సీరియల్‌లో నటిగా అవకాశం కల్పిస్తామని మాయమాటలు చెప్పి ఒక మహిళను నిర్బంధించి అత్యాచారం, వ్యభిచారం చేయించిన కేసులో భార్యాభర్తలకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్ శ్రీనివాసనగర్‌కు చెందిన లంక చమక్క, లంక నాగరాజు దంపతులు ఒక మహిళకు టీవీ సీరియల్‌లో అవకాశం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ఓ చోట నిర్బంధించారు. నాగరాజు ఆమెపై అత్యాచారం చేశాడు. పాలలో మత్తు పదార్థాలు కలిపి తాగించి వ్యభిచారం చేయించారు. బాధిత మహిళ ఫిర్యాదుతో 2021 నవంబరు 13న ప్రకాశ్‌నగర్ సీఐ ఆర్‌జే రవి కుమార్ కేసు నమోదు చేశారు. ఎస్పీ జగదీశ్ వచ్చిన తర్వాత స్పీడీ ట్రైల్ పేరుతో విచారణలో ఉన్న కేసులను వేగవంతం చేసే చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ విజయ్‌పాల్ స్వీయ పర్యవేక్షణలో ప్రకాశం నగర్ ప్రస్తుత సీఐ కేవీఎస్ సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడిపై నేరం రుజువు చేయడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ, సీఐతో పాటు కోర్టు హెచ్‌సీ పికొండలరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు.

లోక్ అదాలత్‌లో రెవెన్యూ కేసులు అధిక సంఖ్యలో పరిష్కారమవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించిన కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం కావడానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని రెవెన్యూ అధికారులతో ఆమె గురువారం సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం పొందే కేసులకు కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇరుపక్షాలకు అంగీకారమైన పరిష్కారం లభిస్తుందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి రాజీకి అర్హమైన కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. జీపీ సీహెచ్‌వీ ప్రసాద్, ఏజీపీ సీవీఆర్ రెడ్డి, కేఆర్ ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, కార్యదర్శులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి కేరళకు చెందిన వ్యక్తి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి8: రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేరళకు చెందిన అఖిల్‌జార్జ్ (24) విశాఖపట్నం క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చి తిరిగి వెళుతుండగా ఈ నెల 3,4 తారీఖుల్లో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అన్నవరం రావికంపాడు మధ్య జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మృతదేహం పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా మారిందని కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ షేక్ అబ్దుల్‌మారుఫ్ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 8: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు గురువారం ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై కలెక్టర్ అవగాహన కల్పించారు. ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, కావూరి చైతన్య, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సరళిపై 66 పేజీల హ్యాండ్ బుక్ రూపొందించినట్లు తెలిపారు. ఎన్నికలు జరిగే రోజున ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సెక్టారు అధికారులకు ఎన్నికల సరళిపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఏడు పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టారు అధికారిని నియమించినట్లు తెలిపారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు వీవీ రమణ, చెల్లయ్య, సువర్ణ, ఫణి, పీఎస్ కుమార్, డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విష్ణేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మరిడమ్మ ఆలయ ఆదాయం లెక్కింపు

పెద్దాపురం, ఫిబ్రవరి 8: మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో గురువారం లెక్కించారు. దేవస్థానం ఏసీ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. 180 రోజుల కాలానికి రూ.6,07,435 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేరీమాత ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక హాల్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుణదలలోని మేరీమాత ఉత్సవాల సందర్భంగా ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ రామవరప్పాడులో పలు రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక స్టాప్ సదుపాయం కల్పించింది. రైలు నెం.17479 పూరి-తిరుపతి, 17481 బిలాస్‌పూర్-తిరుపతి, 17480 తిరుపతి-పూరి, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లను రామవరప్పాడులో నిలుపుదల చేస్తారని విజయవాడ డివిజన్ ప్రజా సంబంధాల అధికారిణి నుస్రత్ ఎం మండ్రూప్‌కర్ తెలిపారు. భక్తులు గమనించాలని ఆమె కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

సోదరుడి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పిఠాపురం, ఫిబ్రవరి 8: పిఠాపురం పట్టణంలో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అతని సోదరుడు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో నివాసముంటున్న అనుపోజు శివ(29), అతని భార్య సుధారాణికి మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి తమ్ముడు దత్తకు ఫోన్ చేసి బయటకు వెళదామని చెప్పడంతో ఇద్దరు కలిసి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి దత్త ఇంటికి వెళ్లిన కొంత సమయానికి శివ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో అన్నయ్య ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికే శివ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. ఆ సమయంలో భార్య సుధారాణి ఇంటి వద్ద లేదని చెబుతున్నారు. కాగా తన సోదరుడు శివ మృతిపై అనుమానాలు ఉన్నాయని దత్త పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాడి నరసింహారావుకు మాతృ వియోగం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 8: తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, తాడి నరసింహారావు మాతృమూర్తి, సినీ నిర్మాత, ప్రముఖ వ్యాపారవేత్త తాడి తాతారావు సతీమణి పొన్నమ్మ(70) బుధవారం రాత్రి మృతిచెందారు. పొన్నమ్మకు నరసింహారావు, జానకీరామ్ కుమారులు కాగా, కుమార్తె రమణీకుమారి ఉన్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన పొన్నమ్మ స్వగృహంలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. పొన్నమ్మ భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. నరసింహారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట నాయకులు గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, పేరాబత్తుల రాజశేఖర్, అర్ధాని శ్రీనివాస్, దొమ్మేటి రమణకుమార్, గోదశి పుండరీస్, కట్టా సత్తిబాబు, దూడల స్వామి, ములపర్తి బాలకృష్ణ, దాట్ల బాబు, కడలి నాగు, అడబాల సతీష్, మెండి కమల చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉదయ్, కురసాల శివబాలు, గొల్లపల్లి గోపి తదితరులు ఉన్నారు. అలాగే పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, బీజేపీ నాయకుడు యాళ్ల దొరబాబు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



పరామర్శిస్తున్న నేతలు

మెడికల్ కాలేజీల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 8: రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలో కొత్తగా మంజూరైన రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం మెడికల్ కాలేజీలు, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్ నాలుగు పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు పి.పద్మాశశిధర్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 20 పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేస్తామన్నారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలన్నారు.

https://eastgodavarai.ap.gov.in
https://kakinada.ap.gov.in,
https://konaseema.ap.gov.in,
https://eluru.ap.gov.in,
https://westgodavari.ap.gov.in,
https://krishna.ap.gov.in,
https://ntr.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందుపరిచామని తెలిపారు.

నర్సరీని సందర్శించిన నటుడు శ్రవణ్



కడియం, ఫిబ్రవరి 8: టాలీవుడ్ దిగ్గజ నటులు నటించిన చిత్రాల్లో ప్రతినాయకుడి పాత్రలను పోషించిన నటుడు శ్రవణ్ గురువారం పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ డైరెక్టర్ పల్ల వినయ్ మొక్కను అందజేసి స్వాగతించారు. దేశ, విదేశాల మొక్కలతో కడియం నర్సరీలు శోభాయమానంగా ఉన్నాయని శ్రవణ్ అన్నారు.

విస్తారక్‌లకు మోటారుసైకిళ్లు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 8: బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అధ్యక్షతన అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో విస్తారక్ యోజన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విస్తారక్, అసెంబ్లీ విస్తారక్‌లకు ద్విచక్ర వాహనాలను అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్, నందూరి శ్రీరామ్, బొంతు శివాజీ, బీఎస్ మూర్తి, వెంపరాల భాస్కరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పెట్టిన ప్రతి స్కీమ్ ఒక స్కామే'



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్రఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు

కొత్తపేట, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో వైసీపీ ప్రవేశపెట్టిన ప్రతి స్కీమ్‌ని జగన్‌మోహన్‌రెడ్డి ఒక స్కామ్‌గా మార్చుకున్నారని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆరోపించారు. స్థానిక రామారావుపేటలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు-నేడులో విద్యార్థు లకిచ్చే ట్యాబ్‌లను అడ్డంపెట్టుకుని విద్యా వ్యవస్థలోనూ అడ్డంగా దోచుకున్నారని ఆరోపించారు. రైతు భరోసాలో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి పంటరుణాలను రూ.5లక్షల నుంచి రూ.3 లక్షలకు కుదించి రైతుల పాలిట వైసీపీ ప్రభుత్వం శాపంగా మారిందన్నారు. రూ.75వేల కోట్లు సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడమే కాక 30 పథకాలను జగన్ సర్కారు రద్దు చేసిందన్నారు. విద్యుత్, రిజిస్ట్రేషన్, నిత్యావసరాల ధరలను పెంచి పేద ప్రజల నడ్డివిరిచిన జగన్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. నాయకులు బూసి జయలక్ష్మిభాస్కరరావు, వాసంశెట్టి సత్యనారాయణ, కముజు శ్రీను, కముజు గంగాధర్, యల్లమల్లి చంద్రకుమారి, రాయుడు రాజేశ్వరి, బూసి మరియమ్మ, చిట్టూరి శ్రీను, కొంబత్తుల వేణు, రాము పాల్గొన్నారు.

జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా: గిడ్డి



జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఫిబ్రవరి 8: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు జనసేన పార్టీని అభివృద్ధి చేస్తానని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పార్టీ అధ్యక్షుడు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. లంకగ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అంబాజీపేట మండలం చిరతపూడికి చెందిన పలువురు కార్యకర్తలు నక్కా నరేష్, కోట వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల మత్స్యకార విభాగం కార్యదర్శి మాల్లాడి గోపి ఆధ్వర్యంలో లంకగన్నవరానికి చెందిన పలువురు మత్స్యకారులు జనసేన పార్టీలో చేరారు. జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ, జాలెం శ్రీనివాసరాజా, పోలిశెట్టి రాజేష్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కొమ్ముల కొండల రావు, అడబాల తాతకాపు, యల్లమిల్లి కృష్ణవేణి, అన్నాబత్తుల హనుమాన్, తాటికాయల శ్రీను, యన్నాబత్తుల నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న బీజేపీ తీరుకు నిరసన



గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వామపక్షాలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 8: రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని వామపక్షాల నాయకులు గురువారం గడియార స్తంభం సెంటర్లో నిరసన తెలిపారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అంద్ర మాల్యాద్రి విమర్శించారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఐకమత్యంతో గద్దె దింపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీల సభ్యులు గుదే దుర్గాప్రసాద్, విప్పర్తి మోహనరావు, భాస్కరరావు, నిమ్మకాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• సీఐటీయూ జిల్లా కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్
• తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆశాల నిరసన

ఆశా వర్కర్లపై జగన్ ప్రభుత్వం నిర్బంధం





అల్లవరం, రావులపాలెం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 8: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, యాప్‌ల పేరుతో చేయించుకుంటున్న పనిభారాన్ని తగ్గించాలన్న ప్రధాన డిమాండుతో 'చలో విజయవాడ'కు బయల్దేరిన ఆశాలపై జగన్ ప్రభుత్వం నిర్బంధం కొనసాగించడాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్ ఖండించారు. ఆశాలను అరెస్టుచేసి కల్యాణ మండపాలు, పోలీసుస్టేషన్లలో నిర్బంధించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

పి.గన్నవరం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట డిమాండ్లు పరిష్కరించాలని ఆశాకార్యకర్తలు నిరసన తెలిపారు. తహసీల్దార్ ఎస్‌కేహాస్సేన్‌కు వినతిపత్రం అందించారు. ఆశా వర్కర్ల యూనియన్ మండల నాయకులు నక్కా సుబ్బలక్ష్మి, ముత్తాబత్తుల పుష్పమ్మ, కనకలక్ష్మి, ఎస్.భారతి, కె.జ్యోతి, ఎ.వరలక్ష్మి, నక్కా బేబికుమారి, కె.దుర్గాలక్ష్మి, ఎ.కుమారి, జి.జ్యోతి, కె.సరిత, దేవి, సుమాంజలి, వై.దుర్గాభవాని పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్లు పరిష్కరించాలని ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

మామిడికుదురు: ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మిని ప్రభుత్వం చర్చలకు పిలిచి అక్రమంగా అరెస్టు చేయడం దారుణమైన చర్య అని ఆశ కార్యకర్తలు పేర్కొన్నారు. కె.ధనలక్ష్మిని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ, ఆశ కార్యకర్తలు డిమాండు చేశారు. అక్రమంగా అరెస్టుచేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అందించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: తమ డిమాండ్లను పరిష్కరించాలని నినదిస్తూ ఆశా వర్కర్లు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. శాంతియుతంగా ఆందోళన చేసేందుకు విజయవాడ వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకుని కేసు నమోదు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాట్రేనికోన: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ దాసరి ప్రశాంతికి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ మండల కార్యదర్శి విత్తనాల రాంబాబు, గోడ దుర్గ, మంగాదేవి, వెంకటలక్ష్మి, విజయశాంతి, మేరీ సుజాత, పార్వతి, రేవతి, నీరజ పాల్గొన్నారు.

అల్లవరం: ఆర్.మంగాదేవి, కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు.

అంబాజీపేట: తహసీల్దారు కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. విజయవాడ వెళ్తున్న 50మందిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు జె.విమలకుమారికి అందించారు. అధ్యక్ష, కార్యదర్శులు బీర ఎస్తేరురాణి, ఈతకోట మేరీప్రమీల, ఎస్.వరలక్ష్మి, స్వరూపరాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని 57 మంది ఆశా వర్కర్లను విజయవాడ సభకు వెళ్లకుండా పోలీసులు బైండోవర్ చేశారు. వారిని గురువారం మధ్యాహ్నం విడుదల చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు నిరసన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 8: ముమ్మిడివరం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్లతొలగింపు కోసం శుక్రవారం అయినాపురం, అనాతవరం, ముమ్మిడివరం, ఎంహెచ్‌క్యు1, ఎంహెచ్‌కు2, ఆర్‌డబ్ల్యుఎస్, కొత్తలంక, తాజేలంక ఫీడర్లపై ఉదయం7నుంచి 10గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.

మలికిపురం: మలికిపురం, లక్కవరం, గొల్లపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈఈ ఎం.సతీష్ తెలిపారు. తూర్పుపాలెం, లక్కవరం, కత్తిమండ, మలికిపురం, రామరాజులంక, జి.పల్లిపాలెం, మోరి, వీవీమెరక, అంతర్వేదిపాలెం గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం, పేరవరం సబ్‌స్టేషన్ల పరిధిలోని 17గ్రామాల్లో శుక్రవారం ఉదయం9నుంచి 1ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.

అంబాజీపేట: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా అంబాజీపేట, గంగలకుర్రు, ముక్కామల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.

పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

అంబాజీపేట, ఫిబ్రవరి 8: అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని బాపట్ల ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. పరిశోధనలు, బదనికల తయారీ, కొబ్బరి మొక్కల రకాలు, తెగుళ్లు, పురుగులు, వంటి వాటిపై పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, డాక్టర్ వి.అనూష, ఎ.కిరిటీ, బాపట్ల అధ్యాపకులు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సాయిరామ్‌కుమార్, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

రామచంద్రపురం, ఫిబ్రవరి 8: పట్టణ పరిధిలో గురువారం 4వ విడతలో 627 డ్వాక్రా సంఘాలకు రూ.5.71 కోట్ల ఆసరా చెక్కును లబ్ధిదారులకు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైసీపీ పట్టణ కన్వీనర్ శ్రీధర్, మెప్మా సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై ఎలుగెత్తిన సభ్యులు



సమావేశంలో నాడు-నేడు పనుల పరిస్థితిపై ఎంఈవోను ప్రశ్నిస్తున్న కోరుమిల్లి సర్పంచ్ ఆచంట

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 8: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన కపిలేశ్వరపురం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలు సమస్యలపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండటంతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు సమావేశానికి హాజరుకాలేదు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, సాకా శ్రీనివాస్ మాట్లాడారు. మండలాభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బాధ్యతగా వ్యవహరించాలని జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు కోరారు. ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి శాఖల వారి అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. నాడు-నేడు పనుల పరిస్థితిపై నాలుగు సమావేశాల నుంచి ఎంఈవో దృష్టికి తీసుకువెళ్తినా ఆయన సరైన సమాధానం చెప్పకుండా దాటవేతధోరణి అవలంబిస్తున్నారని కోరుమిల్లి సర్పంచ్ ఆచంట సత్యనారాయణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కుక్కకరిచిన వ్యక్తి ప్రభుత్వాసుపత్రికి వెళ్లితే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని అంగర ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్ అన్నారు. పీఎం కిసాన్ అందడంలేదంటూ కోరుమిల్లి సర్పంచ్ ఆచంట, సాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై అచ్యుతాపురం ఎంపీటీసీ పలివెల మధు, కోరుమిల్లి, నేలటూరు సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీడీవో రామకృష్ణారెడ్డి సూచించారు. సమావేశంలో వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రికెట్ పోటీలకు గొల్లవిల్లి టీమ్

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 8: 'ఆడుదాం ఆంధ్రా' రాష్ట్ర పోటీలకు గొల్లవిల్లి సచివాలయం మహిళా క్రికెట్ జట్టు ఎంపికయ్యింది. గురువారం గొల్లవిల్లి జడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో ఈవోపీఆర్డీ కేవీఎస్ గౌరీకుమారి, హెచ్‌ఎం లంక రాణి, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ జెండా ఊపి విశాఖలో జరిగే రాష్ట్ర పోటీలకు క్రీడాకారులను పంపించారు.

యానాం చేరుకున్న ఎస్పీ రాజశేఖరన్

యానాం,ఫిబ్రవరి8: యానాం ఎస్పీగా నియమితులైన రాజశేఖరన్ గురువారం యానాం వచ్చారు. ప్రభుత్వ అతిథి గృహం వద్ద సీఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, కట్టా సుబ్బారాజు, మలిరెడ్డి శ్రీను తదితరులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం యానాం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఓటర్ల జాబితాపై ఆర్డీవో సమీక్ష

రామచంద్రపురం, ఫిబ్రవరి8: ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆర్డీవో ఎస్.సుధాసాగర్ సమీక్ష నిర్వహించారు. ఆన్ లైన్‌లో జనవరి 6నుంచి ఫిబ్రవరి7వరకు వచ్చిన ఫారం-6 దరఖాస్తులు-999, ఫారం-7 దరఖాస్తులు517, ఫారం-8దరఖాస్తులు 896వచ్చాయన్నారు. క్లయిమ్స్ వివరాలు, పెండింగ్ వివరాలకు సంబంధించిన కాపీలను నాయకులకు అంద జేశారు. బీఎస్పీ నుంచి కొల్లపు కామేశ్వరరావు, సీపీఐ నుంచి పెద్దిరెడ్డి రాము, బీజేపీ నుంచి కొట్టువాడ హరిబాబు, టీడీపీ తరఫున కడియాల రాఘవన్ పాల్గొన్నారు.

నేడు చొల్లంగి తీర్థం

అల్లవరం, ఫిబ్రవరి 8: ఎన్.రామేశ్వరంలోని పార్వతీ రామేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం చొల్లంగి తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ అంగాని రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. తీరంలో సముద్ర స్నానాలు జరిగే చోట, ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

కులవ్యవస్థకు వ్యతిరేకంగా పాలక ప్రభుత్వాలు ప్రచారం నిర్వహించాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 8: కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పాలక ప్రభుత్వాలు ప్రచారం నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండు చేసారు. దేశంలో మనువాద మతోన్మాద పాలన జరుగుతోందని.. దళితులు, ఆదివాసీలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. దళిత గిరిజనులకు రక్షణ, భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గురువారం అమలాపురంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహనీయుల జీవిత చరిత్రతో ముద్రించిన డైరీని ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయి రాంబాబుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకుని కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. నాయకులు శెట్టిబత్తుల తులసీరావు, గుదే దుర్గాప్రసాద్, కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా సునీల్‌కుమార్

అల్లవరం, ఫిబ్రవరి 8: అల్లవరం తహసీల్దారుగా పి.సునీల్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏపీ సెక్రటేరియట్ ప్రణాళికా విభాగం నుంచి బదిలీపై వచ్చారు. ఆయన్ను పరిపాలనాధికారి ఎన్వీవీ సత్యనారాయణ, ఆర్ఐ మేడిద దుర్గాశ్రీనివాస్, వీఆర్వోలు, వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఎల్టా ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పరీక్షలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 8: ముమ్మిడివరం రవీంద్ర హైస్కూలులో 9,10తరగతుల విద్యార్థులు 70మందికి గురువారం ఎల్టా ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఇంగ్లీషు ప్రొఫిషీయన్స్ పరీక్షలు నిర్వహించారు. విజేతలైన ఏడుగురు విద్యార్థులకు సీఐ ఎన్.కొండయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డయానా, వైద్యులు శృతి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ డీఎల్ శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీవీ ప్రసాదరావు, జేవీఎల్ నరసింహారావు, పి.మూర్తిరాజు, జె.సత్తిబాబు, పాఠశాల బృందం పాల్గొన్నారు.

వైసీపీ విజయానికి కృషి చేయాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 8: అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో వైసీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు కోరారు. వైసీపీ మండల శాఖ అధ్యక్షుడిగా నియమితులైన విత్తనాల ఇంద్రశేఖర్‌ను సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎం.ఎం.శెట్టి, కొర్లపాటి కోటబాబు, నాగవరపు నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా పుట్టాలమ్మవారి జాతర

కె.గంగవరం, ఫిబ్రవరి 8: పామర్రు గ్రామదేవత పుట్టాలమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మంచినీటి చెరువు పరిశీలన

మలికిపురం, ఫిబ్రవరి 8: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌లో భాగంగా గుడిమెళ్లంక మంచినీటి చెరువును అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, రైల్వే అధికారులు పరిశీలించారు. గుడిమెళ్లంక గ్రామం మధ్యగా ఉన్న మంచినీటి చెరువు మధ్య నుంచి రైల్వే లైన్ వెళ్లడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. దీనిలో భాగంగా నిరసన దీక్షలు కూడా చేసారు. గ్రామస్తుల ఫిర్యాదుతో ఆర్డీవో కేశవర్ధన రెడ్డి, రైల్వే చీఫ్ ఇంజనీర్ చెరువును పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ అనితకుమారి, రైల్వే, ఎస్ఈ, ఈఈ, గ్రామస్తులు ఉన్నారు.

టీడీపీ మండల శాఖ అధ్యక్షుడికి పరామర్శ

మామిడికుదురు, ఫిబ్రవరి 8: మాతృ వియోగంతో బాధపడుతున్న టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్‌ను జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు గురువారం పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి మంగాయమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కడలి సత్యనారాయణ, సంసాని లక్ష్మీగౌరీపెద్దిరాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, గోగి రమేష్, పాటి గోవిందు, బొంతు భాస్కరరావు, కాకి శ్రీనివాస్, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రావులమ్మ పంట జాతర

అంబాజీపేట, ఫిబ్రవరి 8: గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత శ్రీ రావులమ్మ అమ్మవారి పంట జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలను యువకులు, కాపు సామాజిక వర్గీయులు ఊరేగింపుగా తీసుకువచ్చారు. జాతరకు ముందు 15రోజుల నుంచి అమ్మవారిని గ్రామంలో ప్రతీ రోజు గ్రామోత్సవం నిర్వహించారు. పంటలు అభివృద్ధి చెందాలని అమ్మవార్ని రైతులు, గ్రామస్తులు కోరారు. ఉదయం నుంచి అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బడ్జెట్‌ను మసిపూసి మారేడుకాయ చేశారు: గొల్లపల్లి

రాజోలు, ఫిబ్రవరి 8: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బడ్జెట్‌ను మసిపూసి మారేడుకాయ చేశారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తీవ్రంగా విమర్శించారు. తాటిపాకలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో రూ.13వేలకోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకుగాను రూ.35వేల కోట్ల ద్రవ్య లోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనకే దక్కుతుందన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో ఏవిధమైన కొత్త అంశాలు లేవని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.11.58లక్షల కోట్లుగా ఉన్నాయని, మద్యం బాండ్ల ద్వారా రూ.16వేలకోట్లు, కార్పొరేషన్ హామీల ద్వారా రూ.1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖా రూ.94,928 కోట్లు, డిస్కం బకాయిలు రూ.27,254 కోట్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.95,400 కోట్లు, ఈవిధంగా వైసీపీ ప్రభుత్వంలో అప్పులు రెట్టింపు అయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొల్లాబత్తుల కుమార్, చాగంటి స్వామి, మానుకొండ దుర్గాప్రసాద్, గుద్దటి చిట్టబ్బాయి, మట్టా నాగేశ్వరరావు, పొన్నమండ శేషుబాబు, పితాని సూరిబాబు, కొల్లు పెద్దిరాజు, ఆరుమిల్లి రామకృష్ణ, బొడ్డపల్లి చిట్టిబాబు, కరప భద్ర పాల్గొన్నారు.

ప్రకృతి అంతర సాగును పరిశీలించిన కేరళ బృందం

అల్లవరం, ఫిబ్రవరి 8: ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల సాగులో లాభాలు ఆశాజనకంగా ఉన్నాయని కేరళ ప్రభుత్వ ప్లానింగ్ బోర్డు సభ్యుడు అనూప్ కిషోర్, చైర్మన్ వినోద్‌కుమార్ అన్నారు. కోడూరుపాడులో రైతు సిద్దిన వెంకటేశ్వరరావు కూరగాయల సాగును గురువారం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీలో వరి, కూరగాయల సాగు బాగుందన్నారు. జీవామృతం ద్వారా కొబ్బరిలో అంతర పంటగా కూరగాయల సాగును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కోనసీమ ఏవో శ్రీనివాస్, అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, ఎన్ఎఫ్ ఎ.హేమలత, ఎంటీ సూరిబాబు, పాటి సింహాద్రి పాల్గొన్నారు.

మార్పు కావాలి..కాంగ్రెస్ రావాలి

కాట్రేనికోన, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆపార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ కంచుస్తంభం సోనీ అన్నారు. గురువారం గెద్దనపల్లి పంచాయతీ బక్కివారిపేటలో మార్పుకావాలి..కాంగ్రెస్ రావాలి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయితాబత్తుల పండుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాలెపు ధర్మారావు, మల్లాడి గోపి, మల్లాడి శ్రీను, పాలెపు ధర్మరాజు, లంకే నాగరాజుపాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తా

ముమ్మిడివరం, ఫిబ్రవరి 8: ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉదయభాస్కరవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల నుంచి నియోజకవర్గం కాంగ్రెస్‌లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నానన్నారు.

టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలి

అయినవిల్లి, ఫిబ్రవరి 8: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. గురువారం వీరవల్లిపాలెం 10వ క్లస్టర్‌లో సలాది పుల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సలాది నాని, అడపా వెంకటేశ్వరరావు, కొండేపల్లి వెంకటేశ్వరరావు, శ్రీరెడ్డి మోహన్, గెడ్డం రమేష్, వారా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థిని వాలీబాల్ విజేత

మలికిపురం, ఫిబ్రవరి 8: క్రీడలు ఆరోగ్య రక్షణకు ఎంతో తోడ్పడతాయని మలికిపురం ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎంపీ సత్యనారాయణమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మలిపురం డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న చెల్లింగి చందు నియోజకవర్గ స్థాయిలో జరిగిన మహిళల వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానాన్ని, జిల్లా స్థాయిలో అమలాపురంలో జరిగిన పోటీలో ద్వితీయ స్థానాన్ని పొందిన సందర్భంగా కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.సతీష్, విజయ్‌కుమార్, రాహేల్‌బాబు, చిట్టాల సత్యనారాయణ, పీడీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం పునాది పటిష్టత పరీక్ష

యానాం, ఫిబ్రవరి 8: యానాంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణం ప్రక్రియలో భాగంగా మూడేళ్ల క్రితం రూ.1.20కోట్లతో చేపట్టిన పునాది పనులు ఏమేరకు పటిష్టంగా ఉన్నాయనే అంశానికి అంచనా వేసేందుకు లోడ్ టెస్టింగ్ పనులను ప్రారంభించారు. టీటీడీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు ఆనందరామ్, శ్రీనివాస్, యానాం ఆలయానికి చెందిన ఇంజనీర్ టీఎస్ రాజేశ్వరరావు సమక్షంలో నటరాజ్ కనస్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు పరీక్షలు నిర్వహించారు. బరువు ఎంతమేరకు తట్టుకుంటుందనే అంశాన్ని పరీక్షించారు. రూ.6కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

బీమా ఏజెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 8: భారత ప్రభుత్వ తపాలా శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా సేవలకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి కమీషన్ ప్రాతిపదికన ఏజెంట్లుగా నియమించేందుకు అవకాశం కల్పించారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు సమీపంలోని ప్రధాన తపాలా కార్యాలయాలు, ఉప తపాలా కార్యాలయాల్లో సంప్రదించాలని అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను ఈనెల12వ తేదీ వరకు స్వీకరిస్తారని, 15న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

అసమర్థ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి

రాజోలు, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో నేటికి కూడా ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయని అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థి మేలుకో.. భవిష్యత్తు కాపాడుకో.. అనే కార్యక్రమం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం టీడీపీ తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సునీల్‌రాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ విద్యార్థులకు మేనమామ అవుతానని ఈ రోజు కంస మామగా తయారై విద్యార్థులను నయవంచనకు గురి చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక ఐదేళ్లలో 20లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను కరపత్రాల రూపంలో పొందుపరిచి విద్యార్థులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు విష్ణువర్ధన్, యల్లమిల్లి నాగేంద్ర, కట్టా ప్రభాకర్, అనుచూరి రమేష్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు అందరూ నడుం బిగించాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 8: నులి పురుగుల నివారణకు అందరూ నడుం బిగించాలని ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి కోరారు. నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించారు. గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి కె.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.1,68,480

ఆత్రేయపురం, ఫిబ్రవరి 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,68,480 లభించినట్టు ఈవో తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: లాల్‌సలామ్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ట్రూ లవర్
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: యాత్ర-2
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్